"మేం చూడడం వేరు. నీవు చూడకుండా చేస్తా మా నందూ....మేం నీ మంచి కోసం చెపుతున్నాము. మామీద కోపంతో లైఫ్‌లో ముఖ్యమైన విషయాన్ని తొందరపడి నిర్ణయించుకోనక్కర లేదు."

"కమాన్ డాడీ—యిన్నాళ్ళూ నేను ఒప్పుకోలేదని కేకలేశారు. యిప్పుడు సరే అంటే మీరెందుకు తటపటాయిస్తున్నారు....నేను వప్పుకుంటున్నానని చెప్పాగా యింకా ఎందుకు ఆర్గ్యుమెంట్సు...."

భార్యా భర్తలిద్దరూ మొహాలు చూసుకున్నారు. మళ్ళీ— "మేం అన్నామని కోపంతో అంటున్నావేమోనని...."

"కోపం ఏం లేదు డాడీ....నా మంచి కోసమే చెప్తున్నారుగా మీరు యూ కెన్ ప్రొసీడ్ విత్ దిస్ మాచ్. ఇంతకంటే ఏం చెప్పాలి." నందిత అక్కడినుంచి వెళ్ళిపోతూ అంది.

కూతురు ఇంత సులువుగా వప్పుకుంటుందని ఆశించని వారిద్దరి మొహాలు సంతోషంతో వికసించాయి.

(వనిత మాసపత్రిక)

★

# ఈతరం అమ్మాయిలు

"డోన్టు బి సిల్లీ మమ్మీ" రోజుకి పదిసార్లు తల్లితో అనే ఆమాట ఆరోజూ అంది ప్రీతి. డ్రస్సింగ్ టేబిల్ ముందునిల్చుని ఆఖరి నిముషంలో మేకప్ టచ్ చేసుకుంటూ.

రోజులా పూరుకోలేకపోయింది సుజాత. కోపంగా చూస్తూ ఏమిటే ఊరు కుంటున్నకొద్దీ మరీ ఎక్కువవుతుంది. ప్రతీదానికీ డోన్టు బి సిల్లీ అంటావు. ఏమిటా మాటలకి అర్థం, ఇంగ్లీషు నీకేకాదు నాకూ వచ్చు! నీవేం చేస్తున్నా పూరు కుంటే సిల్లీ కాదన్నమాట! ఆవేశంగా అంది.

తల్లి కోపానికి కాస్తతగ్గినా, ఏమిటి మమ్మీ ఇప్పుడేమయిందని ఈ గొడవ విసుగ్గా అంది ప్రీతి.

"శలవు వచ్చేనరికల్లా ఏమిటీ తిరుగుడు అంటున్నాను. ప్రతీసారి ఈ పిక్నిక్కులు. పార్టీలు, సినిమాలు వీటికి అంతులేదా—ఎప్పుడో ఏదో ఓసారి సరదాగా వెళ్ళడం సరే, వారంవారం ఏమిటీ తిరుగుడు. పోనీ ఆడపిల్లలతో అంటేసరే, ఈ మగపిల్లలతో ఈ తిరుగుళ్ళు నాకిష్టంలేదు. ఖచ్చితంగా తన అయిష్టాన్ని చెప్పింది.

"ఓహో, అదీ నీ అసలుగొడవ—ఆడపిల్లలతో తిరిగితే నీకేం అభ్యంతరం లేదన్నమాట నేనెక్కడికి వెళ్ళినా! హేళనగా అంది ప్రీతి.

ఆడపిల్లలతోనైనా సరే అస్తమానూ ఇలా తిరగడానికి వీలులేదు. శలవు వస్తే కాస్త చదువుకోడంలేదు. ప్రతి ఆదివారం పిక్నిక్కులు, సినిమాలు ఏమిటిదంతా. ఇదంతా చాలదన్నట్టు బాయ్‌ఫ్రెండ్స్‌తో కూడా తిరుగుతుంటే అభ్యంతరం కాకపోతే ఏమిటి?

"ఎందుకట అభ్యంతరం" తల్లితో రెట్టించింది.

"ఆడపిల్ల వు వయసువచ్చిన పిల్లవి కాబట్టి" సుజాత కోపంగా అంది.

"తిరిగితే ఏమవుతుంది ఏం" ప్రీతి మాటల్లో వ్యంగ్యం.

"ఏమవకూడదనే వద్దనడం నీవేం చిన్న పిల్లవనుకుంటున్నావా— ఎవరితో పడితే వాళ్ళతో తిరుగుళ్ళు పనికిరావని చెప్తున్నాను.

"మమ్మీ డోన్టు బి సిల్లీ! ఐనో మై లిమిటేషన్స్, నా జాగ్రత్తలు నాకుతెలుసు. సరదాగా తిరిగితే చెడిపోయినట్టే అనడం.... ఇట్స్ యువర్"

"ఆగిపోయావేం అను. ఇట్స్ యువర్ స్టుపిడి టి ఫూలిస్‌నెస్.... నీకొచ్చిన పదాలన్నీ వాడి—

ప్రీతి ఇంకేంఅనేదో వాదించేదోకాని బయటనుంచి హారన్ విన్పించింది. దాంతోపాటు 'స్మృతి' హాయ్ ప్రీతి ఆర్ యు రెడీ అనుకుంటూ బాబ్డుహెయిర్ ఎగదోసుకుంటూ లోపలికి వచ్చింది. హాయ్ ఆంటీ అంటూ సుజాతని పలకరించి ఓ నవ్వు పారేసింది. బయటనిలబడ్డ మారుతీవేన్‌లో శర్మద, లావణ్య అపూర్వలతో పాటు విక్కీ నిఖిల్, డ్రైవింగ్ వీల్ ముందు సంజయ్ ఉన్నారు. అయిదుగురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలన్నమాట! విక్కీ స్మృతి అన్న.... నిఖిల్ లావణ్య కజిన్—సంజయ్ శర్మద అంకుల్—అంతా ఒకే కాలేజీలో చదువుతున్న వారే. ఇంటికి వచ్చిపోతుండే వాళ్ళే!

అయామ్ రెడీ, కమాన్ లెటజ్ గో! అంటూ భుజాన పెద్ద హాండ్ బ్యాగ్ ఓ చేతిలో గాగుల్స్ మరో చేతిలో తల్లి ని వేధించి చేయించుకున్న పూరి, కూర వున్న హాట్ క్యారియర్ తో తల్లివంక చూడకుండానే బయటికి నడిచింది. ప్రీతి.

"బై ఆంటీ" అంటూ పరుగెత్తింది స్మృతి.

నిస్సహాయంగా చూస్తూ నిలబడింది సుజాత గుమ్మంలో. ఎర్రబడ్డ మొహంతో నిలబడ్డ భార్యని చూస్తూ లోపల్నించి పేపరుతో వచ్చిన కేశవరావు ఏమిటలా నిల బడ్డావు ఏం చూస్తున్నావు అన్నాడు.

"మీ అమ్మాయి వేషాలని" విసురుగా అంది.

"ఏం చేసింది మా అమ్మాయి" నవ్వాడు.

"అలా నవ్వండి. ఏదో గొప్ప అనుకుంటున్నారు పిల్లల్ని అలా ఎంకరేజ్ చెయ్యడం, ఏదో ఒకరోజు తెలుస్తుంది ఈ నవ్విన దాని ఫలితం" కోపంగా అంది.

"గోరంతలని కొండంతలుగా ఊహించకోయ్. ఇప్పుడేం జరిగిందని అంత భయపడ్తున్నావు. ఈ ఏజ్ లో కాకపోతే యింకెప్పుడు ఎంజాయ్ చేస్తారు పిల్లలు. రెస్పాన్స్‌బిలిటీస్ లేని ఈ రోజులు మళ్ళీ వస్తాయా జీవితంలో. నీ చిన్నతనం గుర్తు తెచ్చుకో"

"ఆ గుమ్మందాటితే మా నాన్నగారి చెవిలో ఊదేది మా బామ్మ. కాలేజీ నుంచి రావడం అరగంట ఆలశ్యమైతే నవాలక్ష ప్రశ్నలు వేసేవారు. ఇలా అబ్బాయి లతో పిక్నిక్కులు వెళ్ళడం కూడా మాకు"

"నీకూ, ఈ తరానికి మున్పై ఏళ్ళ డిఫరెన్సు వుందన్నమాట మర్చిపోకు అయినా అందరూ కల్సి సరదాగా తిరుగు తున్నారు కానీ. ఇదొక్కటే బాయ్ ఫ్రెండ్ తో వెళ్ళడం లేదుగా. ఏదో పెళ్ళయ్యే వరకే కదా ఈ ఫ్రీడం. పోనిద్దూ...."

"అలా అంటూ మీరు దాన్ని సైడ్ చేస్తుండబట్టే నా మాటంటే దానికి అసలు లెక్కలేకుండా పోయింది. ఏం అన్నా డోస్టు బి సిల్లీ, డోన్టు బి స్టుపిడ్ అంటూ వెధవ మాటలు...."

నవ్వేశాడు కేశవరావు, "మరి బోలెడు ఖర్చు పెట్టి కాన్వెంట్ చదువులు చదివించుకున్నందుకు ఆమాత్రం ఇంగ్లీషు మాట్లాడొద్దు" హాస్యంగా అన్నాడు. "అయినా నీపూరికే వర్రీఅవకు సుజా. ఈ కాలంపిల్లలు మీకాలం అమ్మాయిలలా తెలివి తక్కువవాళ్ళు కాదు. ఎంతవరకు గార్డు చేసుకోవాలో తెల్సువాళ్ళకి"

"సరే మీకంత నిశ్చింత అయితే నాకేం పోయింది. ఇలా తిరగడానికి ప్రీడం ఇచ్చి అది రేపు ఏ తలమాసినవాడినో కట్టుకుంటే అప్పుడు తెలుస్తుంది మీకు" సుజాత కోపంగా అని వెళ్ళిపోయింది. కేశవరావు నవ్వుకుని పేపర్‌లో తల దూర్చాడు.

* * *

క్రూతురి ధోరణి చూస్తుంటే సుజాతకేమధ్య భయంగా వుంటున్నది. యూనివర్శిటీలో చేరిం దగ్గరనుంచి బాయ్ ఫ్రెండ్స్ ఎక్కువైపోయారు. బిఏ వరకు ఉమెన్స్ కాలేజీలో చదవడం వల్ల యిన్నాళ్ళు ఆడపిల్లలతోనే స్నేహాలు, ఇళ్ళకి రావడాలు పోవడాలు వుండేవి. ప్రీతి ఈ కాలం పిల్లలకి ఏం తీసిపోదు ఏ విషయం లోనూ, రోజుకోరకం డ్రస్సులు, మిడీలు, స్కర్టులు, చూడీదార్ కమీజులు, జీన్స్ ఫ్యాట్ బాబ్డుహెయిర్, మాటకోసారి హాయ్, యా అనడాలు, ఫ్రెండ్స్ పార్టీలు, పిక్నిక్‌లూ ఓ అప్పర్ మిడిల్ క్లాసు అమ్మాయి ఎలా వుంటుందో అలా స్మార్టుగా వుంటుంది. తయారవడం, మాట ఐడియా అన్నీ కొత్తవున్న వాళ్ళఅమ్మాయికి ప్రతీకగా వుంటుంది. స్మార్టు నెస్ మాటల్లోనే కాక చదువులో, గేమ్స్‌లో అన్నింటిలో చూపించడంతో తల్లిదండ్రులు కూతిరి గురించి అంత పట్టించుకోలేదు. తెలివిగా చదువుతుంది. స్మార్టుగా వుంటుంది. ఈ కాలం పిల్లల్తో కల్సిమెల్సి వుండాలంటే ఇవన్నీ తప్పవు అనుకునేది సుజాత. కేశవరావు ఓ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌అవడం, యిద్దరే పిల్లలు అవడంతో పిల్లల కోరికలు తీర్చడానికి ఎప్పుడూ వెనుకాడలేదు. బంగళా-కారు, ఇంట్లో టీవీలు, ఫ్రిజ్‌లు, వీడియోలు, ఎయిర్ కండీషనుల మోడర్న్ లైఫ్‌కి కావల్సిన హంగులు ఇంట్లో అమరడం, తల్లిదండ్రులు తమ కోరికలు తీర్చ గలిగిన స్థాయిలో, హోదాలో వుండడంతో ప్రీతి ముందునుంచి జాలీ లైఫ్‌కి అల వాటుపడింది. తెలివైనది కావడంవల్ల ఒక్కసారి చదవడంతో సరిపోయేది. మిగతా టైము నవల్సు. వీడియోలు, ఫ్రెండ్స్, పార్టీ అంటూ తిరిగేది. చదువు నిర్లక్ష్యం చెయ్యకపోవడంతో ఇన్నాళ్ళు సుజాత పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఈ ఏడాదిగా యూనివర్శిటీలో చేరిం దగ్గరనుంచి మగపిల్లల స్నేహాలు, మగ పిల్లలతో తిరగడాలు సుజాతకి నచ్చలేదు. ఎంత ఆధునికత అయినా ఇంకా ఈ దేశంలో బాయ్ ఫ్రెండ్స్‌తో తిరిగితే ఎవరూ హర్షించరు అని సుజాతకి తెలుసు. అంతేకాక ఇలా స్నేహాలతో మొదలుపెట్టి, తరువాత లవ్ ఎఫైర్లకి దిగి తరువాత తమ కులం గోత్రం లేనివాడిని, ఏ ఉద్యోగం సద్యోగం లేనివాడినో కట్టుకుంటానంటే—అదీ సుజాత భయం! ఒక్కగానొక్క పిల్ల—బాగా చదువు, ఉద్యోగం పెద్ద హోదా అంతస్థు అన్నీవున్న ఇంట్లో పడేయాలని తల్లిదండ్రులుగా తమ కోరిక! ప్రీతి చక్కగా స్మార్టుగా వుంటుంది. చదువుంది. తండ్రికి హోదా వుంది. మంచి

సంబంధాలు రాక ఏం చేస్తాయి. ఇప్పుడిలా ప్రీతిని యిష్టం వచ్చినట్టు వదిలేస్తే ఏ తలమాసిన వాడినో కట్టుకుంటానంటే అప్పుడేం చేసేట్టు! ఎప్పుడే క్షణంలో ఏదన్నా వీక్ మూమెంట్‌లో జరగరానిది జరిగితే! సుజాత అందుకే కూతుర్ని అదుపులో పెట్టాలని ప్రయత్నిస్తుంది. కానీ ప్రీతి ఇన్నాళ్ళు అలవాటుపడిన ఫ్రీడం వదులుకోవడానికి ఇష్టపడటంలేదు. దాంతో తల్లీకూతుళ్ళ మధ్య వాగ్యుద్ధాలు తలెత్తుతున్నాయి ఈ మధ్య తరుచూ. సుజాత ఏదో అనడం—ప్రీతి నిర్లక్ష్యంగా దులపరించడం మామూలు అయ్యింది. కేశవరావు చూసీచూడనట్టు వూరుకోడం. మరో సారి భార్యకి నచ్చచెప్పడం, మరీ మితిమీరిందన్నప్పుడు కూతుర్ని కాస్త మందలించడం చేస్తూ సర్దుకొస్తున్నాడు.

ప్రీతికి తల్లి దంతా చాదస్తంగా, తల్లి భావాలు సిల్లీగా, తల్లి ఆలోచనలు స్టుపిడ్‌గా, క్రోడ్‌గా అనిపిస్తున్నాయి. తమ కాలంలోలా ఇంట్లో పడివుండాలి. కాలం మారినా మనుష్యులు మారరేం! డిగ్రీవున్న అమ్మాయిలా ఆలోచిస్తుందేం? బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరిగితే తప్పా! నలుగురు సరదాగా ఏ సిన్మాకో వెళితే అంత రాద్ధాంతం ఎందుకు? సినిమాకి అబ్బాయిలతో వెళ్ళితే కొంపలు మునిగిపోతాయా, ఎంజాయ్ చెయ్యకుండా పుస్తకాల పురుగులా ఇంట్లో కూచుని చదవాలా ఇరవై నాల్గు గంటలు! అప్పుడే బుద్ధిమంతురాలికింద లెక్క—ఈ మమ్మీలంతా ఇంతే ఎప్పుడూ-డాడీలే నయం కాస్త! ప్రీతి ఆలోచనలలా వుంటాయి!

* * *

ఆ రోజు టేబిల్‌మీద గుట్టలా పడివున్న పుస్తకాలు సర్దుతుంటే ఓ పుస్తకంలోంచి జారిపడ్డ రెండు మూడు ఫోటోలు చూసి చకితురాలైంది సుజాత. మొన్న పిక్నిక్ వెళ్ళినపుడు తీసుకున్నవి ఫోటోలు. ఓ ఫోటోలో అందరూ గ్రూప్‌గా అమ్మాయిల మధ్య అబ్బాయిలు, అబ్బాయిల పక్కన అమ్మాయిలు కూర్చుని ఒకరి మీద ఒకరు చేతులు వేసుకుని తీయించుకున్నారు. మిగతా రెండు ఫోటోలు విక్కీ, ప్రీతీ ఇద్దరూ, ఒకదాన్లో ఒకరి నడుం ఒకరు పట్టుకుని, రెండోదాన్లో విక్కీ, ప్రీతి భుజాలచుట్టూ చెయ్యివేసి చాలా దగ్గరగా, క్లోజ్‌గా కనిపిస్తూ తీయించుకున్నవి. సుజాత మొహం ఎర్రబడింది. ఎంత ధైర్యం దీనికి! ఇంత క్లోజ్‌గా ఇంత చనువుగా ఇలా ఫోటోలు తీయించుకునే వరకు వెళ్ళిందన్న మాట వీళ్ళ పరిచయం—పరాయి మగపిల్లలతో భార్యాభర్తలు తీయించుకున్నంత చనువుగా ఫోటోలుతీయించుకుంటుందా! విసవిస ఫోటోలు పట్టుకుని ఆఫీసుకి తయారవుతున్న కేశవరావు దగ్గరకి వచ్చింది.

చూడండి....ఇవి చూడండి. నేచెబితే నా మాట తేలిగ్గా కొట్టి పారేస్తారు— దీని వ్యవహారం ఎంతవరకు వచ్చిందో చూడండి ఆవేశంగా అంది ఫోటోలు విసురుగా అతని ముందు పడేసి.

ఏమిటీ ఏమయింది టై బిగించుకుంటూ ఫొటోలకేసి చూశాడు.

చూశారా ఎంజాయ్ చేయనీ, చిన్నపిల్లలు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు సరదాలు అంటూ నా నోరు మూయించారు. ఇప్పుడేమంటారు. కోపంగా నిలేసింది. ఫొటోలు చూసి ఒక్కక్షణం కేశవరావు నుదురు చిట్లించాడు. అతనికి కూతురు అలా అబ్బాయిలతో అంత క్లోజ్‌గా ఫోటోలు తీయించుకున్నందుకు కాస్త షాక్ లాంటిదీ కలిగింది. ఏదో ఒక ఫేమిలీలా మసులుతున్నారు వాళ్ళ గ్రూప్ అందరూ. సరదాగా తీయించుకుని వుంటారు. అనవసరంగా మరీ టూమచ్‌గా ఆలోచించి వర్రీ అయ్యేందుకు నాకేం కనపడలేదు. మొహంలో భావం ప్రసన్నంగామార్చి అన్నాడు. తేలిగ్గా తీసుకున్నట్టు. భార్య దగ్గర తన భావం బైటపెడితే ఇంకా సాధిస్తుందని అతని భయం.

ఇంకా కూతుర్ని వెనకేసుకొస్తున్నారా? ఈ ఫోటోల్ని ఎవరన్నా ఏ మొగుడు పెళ్ళాలవో అనుకుంటారుగాని ఫ్రెండ్స్‌ని, సరదా అని ఎవరూ అనుకోరు. మీకు కూతురిమీద ప్రేమతో కళ్ళకి పొరలు కమ్మేశాయి. ఇలాగే వూరుకోండి. నాకేం బాధ మధ్య.

అబ్బ. సరే వెళ్టూ. వూరికే గొడవ చెయ్యకు. రాత్రి ప్రీతిని పిలిచి ఇలా చెయ్యకూడదని చెప్తాము. నీవూరికే దాంతో గొడవపడకు. బూట్స్ లేస్ బిగించి లేచి బ్రీఫ్‌కేస్ తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

రాత్రి భర్త ప్రీతితో మాట్లాడేవరకూ ఓపిక పట్టే ఓర్పు లేకపోయింది సుజాతకి. సాయంత్రం విక్కీ మోపెడ్‌మీద నుంచి దిగి ఉషారుగా ఇంట్లోకివస్తున్న ప్రీతిని చూసేసరికి ఆవేశం పట్టలేకపోయింది. చర చరా ప్రీతి వెనకాతల ఫోటోలు పట్టుకుని ఆమె గదిలోకి వెళ్ళింది. ప్రీతి! గట్టిగా పిలిచింది సుజాత కోపంగా.

ప్రీతి వెనక్కి తిరిగి, తల్లి కోపం అర్థంకానట్టు చూసింది అంతలోనే తల్లి మంచం మీదకి విసిరిన ఫోటోలుచూసి కాస్త గతుక్కుమంది.

"ప్రీతీ, ఏమిటీ ఫోటోలు—సిగ్గులేకుండా మగపిల్లలతో ఈ ఫోటోలేమిటి విక్కీ మోపెడ్‌మీద ఎందుకు వచ్చావు?" కోపంతో మాట తడబడింది సుజాతకి.

"ఏం వస్తే! లిఫ్టు యిస్తానన్నాడు. తనకిటే ఏవో పనివుంది వస్తున్నానంటే వచ్చాను తప్పా. ఎందుకలా చూస్తావు?" ప్రీతి విసురుగా జవాబిచ్చింది.

"ఈ ఫోటోలేమిటి?"

"మొన్న పిక్నిక్‌లో సరదాగా తీసుకున్నాం" ప్రీతీ నిర్లక్ష్యంగా అంది.

"మగపిల్లలతో కౌగిలించుకుంటూ ఫోటో తీయించుకోడం సరదానా?"

"అబ్బ ఏమిటి మమ్మీ! ఫ్రెండ్స్‌తో తీయించుకుంటే తప్పేంవుంది. విక్కీ ఏం కొత్తవాడా" విసుగ్గా మొహంపెట్టి అంది.

"నీకు ఏళ్ళు వస్తున్నాయిగాని బుద్ధి రావడంలేదు. చెపుతున్న కొద్దీ ఎక్కువ చేస్తున్నావు. వయసువచ్చిన పిల్లవి. మగపిల్లలతో ఈ స్నేహాలేమిటి? ఈ తిరుగుళ్ళేమిటి? ఈ ఫోటోలు ఎవరన్నాచూస్తే ఏమనుకుంటారు?" తీక్షణంగా అంది.

"ఏం అనుకుంటారు" రెట్టించింది తల్లివంక హేళనగా చూసి.

సుజాత కూతుర్ని మింగేసేట్టు చూసింది. "ఏం అనుకుంటారా నిన్నో మొన్నో పెళ్ళయిన జంటో, రేపో మాపో చేసుకోబోయే జంటో అనుకుంటారు."

"పోనీ అనుకోనీ నాకేం నష్టంలేదు."

"నీకెందుకు నష్టం. ఎవరేం అనుకుంటే నీకేం బాధ—నిన్ను కన్నందుకు మాకు బాధ, అవమానంగాని ఇవాళ ఫోటోలు. మోపెడ్‌మీద తిరగడం వరకూ వచ్చింది. రేపు ఇంకా ఏం చేస్తావో."

"ఏం చేస్తానని నీ ఉద్దేశ్యం!" ప్రీతి తల్లివంక చురచుర చూసింది. సుజాత కాస్త తడబడింది.

"ఏమన్నా చేస్తావు. అన్నింటికి తెగించిన దానివి. మన కులం గోత్రం లేని వాడిని తీసుకొచ్చి పెళ్ళాడుతానంటావు."

ప్రీతి నిర్లక్ష్యంగా నవ్వింది. "నే పెళ్ళాడాలంటే కులం గోత్రం చూడను. నే చేసుకోవాలంటే మీ దగ్గరకొచ్చి అడగనులే—చేసుకునే తీసుకువస్తాను. "పొగరుగా అంది" బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసుకుంటూ.

సుజాత పెదాలు అదిరాయి. కూతురంతలా కుండబద్దలుకొట్టి చెప్తుంటే యింకేం అనాలో తెలీలేదు. విక్కీ పంజాబి, తల్లి క్రిష్టియను వాడిని పెళ్ళాడుతుందా కొంపదీసి. అందుకే అంత చనువు పెంచుకుంటుందా. ప్రేమిస్తుందా వాడిని. ఈ తిరుగుళ్ళు యింతవరకు వెళతాయని తనకు తెలుసు. అందుకే ముందే జాగ్రత్త

పడాలంటే ఆయన మాట నిర్లక్ష్యంచేసి పారేశారు. రానీ, ఇప్పుడు ఏం జవాబు చెబుతారో.

* * * *

"నేను వచ్చి సాయంత్రం మాట్లాడుతానంటే నీకెందుకు అంత తొందర. దాన్నేదో అని వుంటావు. అది నోటికొచ్చినట్టు వాగివుంటుంది." కేశవరావు విసుగ్గా అన్నాడు పెళ్ళాం కంప్లైంట్ విని.

"తొందరేమిటండీ— మోపెడ్‌మీద నడుంచుట్టూ చేతులు వేసుకు కూర్చుని వస్తే చూస్తూ వూరుకోమంటారా."

"నీ వూరికే గొడవ చెయ్యకు నేను దానితో మాట్లాడుతానులే."

"నా గొడవ కాదు. చేతులుకాలేక ఆకులు పట్టుకుని లాభం వుండదని గ్రహించి మేల్కొండి."

"ప్రీతీ" అసహనంగా పిల్చాడు కేశవరావు భార్య యిచ్చిన "కీ"తో కిర్రెక్కింది అతనికి.

టీవీ చూస్తూన్న ప్రీతి తండ్రి రెండుసార్లు పిలిచాక లేచివెళ్ళింది. తల్లి దండ్రుల మొహాలు గంభీరంగా వుండడం చూసి తల్లి తండ్రితో కంప్లైంట్ చేసిందని అర్థం చేసుకుంది. కాస్త మనస్సు చెదిరింది.

తండ్రి మొహం అలా ఎప్పుడూ చూడలేదు.

"ప్రీతీ అలా కూర్చో—నీతో కొంచెం మాట్లాడాలి" గంభీరంగా అన్నాడు కేశవరావు. "చూడు ప్రీతీ నీకు చిన్నప్పటినించి అన్ని విషయాలలోనూ ఫ్రీడం ఇచ్చాం అవునంటావా."

"ఎస్ డాడీ!" ప్రీతి ఈ సంభాషణ ఎటు దారితీస్తుందా అనుకుంటూ బుద్ధిగా అంది.

"మరి నీ మీద మేము నమ్మకంవుంచి యిచ్చిన స్వేచ్ఛని నీవు దుర్వినియోగం చేయొచ్చా. నీకు ఏది కావాలంటే అది కొన్నాం. ఏం చదువుతానంటే అదే చదవమన్నాం—ఏ బట్టలు కావాలంటే అవే కొన్నాం. గిటార్ నేర్చుకుంటానంటే సరే అన్నాం. మా కిష్టం లేకపోయినా చక్కని జుట్టు కత్తిరించుకున్నా వూరుకున్నాం. నీ ఫ్రెండ్స్‌తో పార్టీలు, షికార్లు తిరిగినా ఎప్పుడూ వద్దనలేదు. అవునా. కానీ ప్రతి దానికీ ఒక లిమిట్ ఉంటుంది. నీవిప్పుడు ఆ లిమిట్ దాటిపోయావు అనిపించడం లేదా నీకు" శాంతంగా, స్థిరంగా అడిగాడు.

"నేనేం చేశాను డాడీ" అమాయకంగా చూసింది.

"ఈ ఫోటోలేమిటి మరి" ఇలా మగపిల్లలతో ఇంత క్లోజ్‌గా మూవ్ అవడం తప్పు కాదనుకుంటున్నావా! మీ అమ్మ చెప్తుంది. ఇవాళ విక్కీ మోపెడ్‌మీద వచ్చావుట."

"ఫ్రెండ్లీగా ఫోటోలు తీయించుకోవడం తప్పేనా? విక్కీ యిటు వస్తుంటే బస్సుకోసం వెయిట్ చేయడం ఒకరోజైన్నా తప్పుతుందని వచ్చాను. అదీ తప్పేనా" కళ్ళనీళ్ళు తిరుగుతుండగా ఉక్రోషంగా అంది.

"ఫ్రెండ్లీగా వుండొచ్చు ప్రీతీ! కానీ ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య స్నేహా నికి కొన్ని లిమిట్స్ వున్నాయి. అబ్బాయి అమ్మాయి ఇలా క్లోజ్‌గా తిరిగితే జరిగే అనర్థం నీకు తెలియనంత చిన్నదానివి కావు కదా. మేం కన్నవాళ్ళం కనుక నీవు తప్పటడుగు వేయకూడదని నీ బాగుకోసమే కొన్ని ఆంక్షలు పెట్టాం. అది గుర్తించ కుండా మీ అమ్మతో ఏవేవో ఇష్టం వచ్చినట్లు అన్నావుట."

"మమ్మీ నన్ననవసరంగా ఇరిటేట్ చేసింది." తల్లి వంక చురచుర చూస్తూ అంది.

"ఏమిటే అనవసరంగా ఇరిటేట్ చేయడం. ఎందుకని అడగడం తప్పా" సుజాత గయ్యిమంది.

"అబ్బ నీవుండు సుజా! నే మాట్లాడుతున్నాగా. మమ్మీ ఏం అన్నా నీమంచి కోసమేగదా. చూడు విక్కీ మంచిపిల్లాడే అవొచ్చు కాని మనది వాళ్ళది భాష, కులాలు, మతాలు అన్నీ వేరు. మనకి వాళ్ళకి కలియదు. ఇంతకీ విక్కీ చదివేది బి.కాం. ఏం చదువుతాడో, ఏం ఉద్యోగం చేస్తాడో."

"డాడీ విక్కీతో ఫోటో తీయించుకుంటే పెళ్ళి చేసుకుంటాననేనా అర్థం" సూటిగా చూసింది.

"ఆ అర్థం లేకపోతే మంచిమాటే. కాని మీ అమ్మతో ఏదో అన్నావట."

"అవసరమైన ఐడియాలు మమ్మీయే ఫీడ్ చేస్తుంది. నాకు ఇప్పుడసలు- నేనేం పెళ్ళి చేసుకుంటాననలేదు" ప్రీతి కోపంగా అంది.

"సరే నీవు చదువుకున్న పిల్లవి వయసు వచ్చింది నీమంచి చెడ్డా ఆలోచించు కోవాలి ఓ స్టెప్ వేసేముందు నీ మనసులో ఏ చెడ్డ ఆలోచనలు లేకపోయినా ఇంత స్వేచ్ఛగా మగపిల్లలతో తిరిగితే మన సొసైటీ హర్షించదు. సొసైటీ సంగతి అలా వుంచి ఓ వయసులోవున్న అబ్బాయి అమ్మాయి మరీ క్లోజ్‌గా తిరిగితే పరిణామాలు ఎలా మారుతాయో చెప్పలేం. నీ మంచికోరే తల్లిదండ్రులుగా చెప్పడం మాబాధ్యత.

సో యూ కీపిట్ అల్ దిస్ ఇన్‌యువర్ మైండ్ "ఈ కాలం పిల్లతో ఇంతకంటే చెప్పనవసరం లేదు. కొట్టి తిట్టి చెప్పే రోజులుకావని తెల్సిన కేశవరావు అంతటితో ముగించాడు. తల్లి వంక చురచుర చూసి బయటికి వెళ్ళిపోయింది ప్రీతి.

"మనం ఇంక ప్రీతికి సంబంధాలు చూడ్డం మంచిది. ఈ ఎమ్మే అయ్యేలోగా చూస్తుంటే పరీక్షలవగానే చేసేద్దాం. పరిస్థితి చెయ్యిదాటకముందే మనం మన బాధ్యత తీర్చుకుంటే మంచిది. మీ దగ్గర భయానికి అలా అంది కాని దానిధోరణి చూస్తే ఏ నిముషంలో ఏంచేస్తుందో అని భయంగావుంది నాకు."

"సుజా నీతో వచ్చిన ప్రోబ్లమ్, అనవసరంగా వర్రీ అయిపోవడం, ఏదేదో ఊహించుకుని....ఇంక ఇరవై ఒకటన్నా నిండలేదు. ఎమ్మే అవనీ ఆలోచిద్దాం పెళ్ళి సంగతి" శాంత అనహనంగా అన్నాడు.

సుజాత అప్పటికి ఊరుకున్నా కూతురి పెళ్ళి ఈ ఏడాదిలోగా చేసెయ్యడం మంచిదన్న ఆలోచన ఆమె మనసుని తొలుస్తూనే వుంది. అక్కకి అన్నకి కూతురికి మంచి సంబధాలుంటే చూడమని ప్రీతి ఫోటోలు, డిటైల్స్ పంపింది.

నెలరోజుల తర్వాత వీళ్ళవాళ్ళు రాసిన ఆరేడు సంబంధాలలో ఇద్దరు అన్ని విధాలా బాగున్నవి సెలక్టుచేసి భర్తకి చూపింది. "ఇప్పుడే మొదలుపెట్టావా. దాని చదువవనీ అన్నానా. దాన్ని ఫైనల్ ఇయర్‌లో డిస్టర్బ్ చేయడం నా కిష్టంలేదు."

"అబ్బ మంచి సంబంధాలండి. ఈఅబ్బాయి ఐఎఎస్ ఎంత పొడుగ్గా స్మార్టుగా వున్నాడో చూశారా. ఫాదర్ మదర్ ఇద్దరు డాక్టర్లు" మంచి ఫేమిలీ. ఈ రెండో అబ్బాయి ఎమ్‌టెక్ చేసి ఎంబిఏ చేసి ఢిల్లీ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నాడు. తండ్రి మంచి హోదాలో వున్నాడు. ఇద్దరూ ఎంత బాగున్నారో. మన ప్రీతికి ఈడూ జోడు బాగా కుదురుతుంది. సంబంధం చూసి నిశ్చయం అయితే, పెళ్ళి పరీక్షలయ్యాక చెయ్యొచ్చు. అసలు ముందు మీ అమ్మాయిగారు ఏమంటుందో. ఇంత మంచి సంబంధాలు కావాలన్నప్పుడు దొరుకుతాయా అనలే తిక్కది ఏం అంటుందోఅని భయంగా వుంది.

"ఫోటోలు చూపించి అభిప్రాయం అడుగు. అది ఇప్పుడే చేసుకోనంటే మనం బలవంతంగా చెయ్యలేం కదా అడిగిచూడు."

"మీరే అడగకూడదా. నాకు తిక్క సమాధానాలు ఇస్తుంది. నీకేం నచ్చలేదు నాకు అనేస్తుంది పొగరుగా."

"అబ్బ అన్నింటికి నీకు అనుమానాలే—తల్లివి నీవడగాలి కూతుర్ని—అది అలా అంటే నేచెపుతాలే. అడిగిచూసి తరువాత ఏంచేయ్యాలో ఆలోచిద్దాం."

"ప్రీతి. ఇదిగో ఇలారా. ఈ రెండు ఫోటోలు చూడు మామయ్య పంపించాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక" డ్రాయింగు రూములో కూర్చుని సౌమ్యంగా పిల్చింది తూతుర్ని సుజాత. "ఏం ఫోటోలు మమ్మీ" ప్రీతీ కుతూహలంగా దగ్గరికివచ్చి కూర్చుని ఫోటో చేతిలోకి తీసుకుంది.

"మామయ్య నీకోసం ఈ పెళ్ళికొడుకుల ఫోటోలు పంపాడు. ఇదిగో ఈ అబ్బాయి ప్రీతమ్ ఐఏఎస్. రెండోది అజయ్‌శర్మ ఇంజనీర్" తల్లి వివరాలు చెప్తుంటే ప్రీతి ఇంటరెస్టుగా ఫోటోలు చూస్తూవింది.

"ఓ యింటరెస్టింగ్. బోత్ ఆర్ స్మార్టుగైస్. ఎస్ఫేషన్ల ఈ ఇంజనీరు బాగు న్నాడుకదూ మమ్మీ వైట్ స్మార్టు."

"నీకు నచ్చాడా. అయితే మామయ్యని వాళ్ళని పిల్లని చూసుకోవడానికి రమ్మనమని చెప్పమంటావా" కూతురు అంత సుముఖంగా మాట్లాడుతుందని ఎదురు చూడని సుజాత సంబరంగా అంది.

"ఐ డోంట్ మైండ్ సీయింగ్ హిమ్ ప్రీతి" అంది.

"అమ్మా తల్లీ బతికించావు. ఇంకా ఏమంటావో ఒప్పుకోకపోతే ఇంత మంచి సంబంధాలు మళ్ళీమళ్ళీ దొరకవుగదా అనుకుంటున్నాను" పెద్ద బండరాయి దిగినంత తేలిగ్గా నిటూర్చి ఆనందంగా అంది.

"ఏం ఎందుకు ఒప్పుకోను నాకు నచ్చితే" ప్రీతి సందేహంగా చూసింది.

"ఏమో నీవు నీ బాయ్ ఫ్రెండ్స్, నీ ధోరణి చూసి అనుమానం వచ్చింది."

"డోన్టుబిస్టుపిడ్ మమ్మీ." తన మామూలు ధోరణిలో అంది ప్రీతి ఎప్పటిలా నవ్వి.

ఈసారి ఆమాటకి కోపం రాలేదు సుజాతకి. తను నిజంగాస్టుపిడే! ఈకాలం పిల్లల తెలివిముందు తను తరం వాళ్ళు నిజంగా స్టుపిడ్స్, ఈకాలం పిల్లలకి తమ కేం కావాలో తమకి తెలుసు! వీలున్నంత వరకు లైఫ్ ఎంజాయ్ చెయ్యడమూ తెలుసు! లైఫ్‌లో సుఖపడడానికి తమకేం కావాలో కూడా తెలుసు. బాయ్‌ఫ్రెండ్స్ తిరగడానికేనని, పెళ్ళికి గావల్సింది జీతం, హోదా, సుఖం అన్న సంగతి ఈకాలం పిల్లలకి ఎంతబాగాతెలుసు. తను స్టుపిడ్ అయినా కూతురు స్టుపిడ్ కానందుకు ఆ తల్లికి ఆనందమే కల్గింది ఆ క్షణంలో.

[ఉదయం వారపత్రిక]

★